సాక్షి
కుమురం భీం

బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



అభాగ్యులకు అభయం!
తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు అభయమిచ్చేందుకు మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నారు. నెలనెలా ఆర్థిక సాయం అందిస్తున్నారు. 8లో▸



టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేయాలి
టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేయాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. మంచిర్యాలలో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. 10లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
41.3 /27.5
ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతుంది. మధ్యాహ్నం బయటకు వెళ్లొద్దని వైద్యులు సూచిస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ : 6:30	గురు : 4:43

న్యూస్‌రీల్

తిర్యాణిలో 41 డిగ్రీల ఎండ

తిర్యాణి(ఆసిఫాబాద్): జిల్లాలో రెండు రోజులుగా సూర్యుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఏప్రిల్‌లోనే పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను దాటుతున్నాయి. తాజాగా మంగళవారం జిల్లాలో అత్యధికంగా తిర్యాణి మండల కేంద్రంలో 41 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అలాగే కెరమెరిలో 40.6, బెజ్జూర్‌లో 40.2, పెంచికల్‌పేట్ మండలం ఎల్కపెల్లిలో 40 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

16న 'మోడల్' ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్‌రూరల్: తెలంగాణ మోడల్ స్కూళ్లలో 6 నుంచి 10వ తరగతుల్లో ప్రవేశానికి ఈ నెల 16న పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

'మిషన్ వాత్సల్య' కింద ఏడుగురికి సాయం

ఆసిఫాబాద్: మిషన్ వాత్సల్య పథకం కింద జిల్లాలో ఏడుగురు అర్హులను గుర్తించి సాయమందిస్తున్నట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ పథకం కింద చిన్నారులకు జూన్ 2021 నుంచి ప్రతినెలా రూ.4 వేల ఆర్థికసాయం అందిస్తున్నామని తెలిపారు. కోవిడ్‌తో కాకుండా ఇతర కారణాలతో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు ఈ పథకం కింద లబ్ధి చేకూర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆదేశాలు రాలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

కౌటాల(సిర్పూర్): ప్రభుత్వం ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు జాదవ్ రాజేందర్ డిమాండ్ చేశారు. సిర్పూర్(టి) నియోజకవర్గంలోని ఏడు మండలాల వీఓఏలు మంగళవారం స్థానిక ఆరె సంక్షేమ సంఘం భవనంలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చాలని ఈ నెల 17 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో మహిళా అధ్యక్షులు జ్యోతి, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ములే దత్తు, అనిల్, సీఐటీయూ జిల్లా నాయకులు కృష్ణమాచారి, సభ్యులు కొండయ్య, పున్నయ్య, మహేశ్వరి, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

నేడు కవి సమ్మేళనం

ఆసిఫాబాద్: బాబాసాహెబ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయంలో కవులు, కళాకారుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు తెలిపారు. తెలంగాణ గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కవులు, కళాకారులు హాజరు కావాలని కోరారు.

'ఐటీడీఏ నిధులు పక్కదారి'

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలానికి మంజూరైన ఐటీడీఏ నిధులను ఐటీడీఏ ఏఈ బద్రుద్దీన్ పక్కదారి పట్టిస్తున్నాడని ఐటీడీఏ డైరెక్టర్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఏళ్లుగా కౌటాల మండలంలో ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన.. ఏజెన్సీ గ్రామాల్లో సర్పంచ్, వీటీడీఏ సభ్యులకు తెలియకుండా పనులు చేస్తున్నారని తెలిపారు. ఏఈ పనితీరుపై ఐటీడీఏ కమిషనర్, రాష్ట్ర మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. ఐటీడీఏ పీవో స్పందించి విచారణ చేపట్టాలని కోరారు.

బాలికలకు ఊరట!



కొద్దిరోజుల్లో విద్యాసంవత్సరం ముగియనుండగా రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీ విద్యార్థులకు ఊరట కలిగించేలా ఆరోగ్య కిట్లకు సంబంధించిన నగదును విడుదల చేసింది. జూన్ నుంచి కిట్లు సరఫరా కాకపోవడంతో అవస్థలు పడుతున్న బాలికల ఖాతాల్లో మూడు నెలలకు సంబంధించిన నగదును జమ చేసింది.

- ఆరోగ్య కిట్లకు సంబంధించిన బకాయిలు విడుదల చేసిన ప్రభుత్వం
- కేజీబీవీ విద్యార్థుల ఖాతాల్లో నగదు జమ
- జిల్లాలోని 15 కస్తూరిబా విద్యాలయాల్లో 3,722 మంది విద్యార్థినులు

కేజీబీవీలు 15 | ఖాతాలు కలిగిన విద్యార్థినులు 3,118 | మంజూరైన నిధులు రూ.9,20,400

ఆసిఫాబాద్‌అర్బన్: నిరుపేద, అనాథ బాలికలను చదువులో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కస్తూరిబా గాంధీ విద్యాలయాలను ప్రారంభించింది. ఎంతో మంది బాలికలు కేజీబీవీల్లో చదువుకుంటూ తమ భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు. ఇక్కడ విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు ప్రభుత్వం ఉచిత వసతి కల్పిస్తూ పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు అందిస్తోంది. గతంలో బాలికల ఆరోగ్య రక్షణకు ఆరోగ్య కిట్లను సరఫరా చేసేవారు. అయితే కిట్లకు బదులుగా విద్యార్థినులకు నేరుగా నగదు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో ఆరోగ్య కిట్ల పంపిణీ నిలిచిపోయింది. గతేడాది జూన్ నుంచి కిట్లు, నగదు రెండూ అందకపోవడంతో బాలికలు పడరాని పాట్లు పడుతున్నారు. దీంతో ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి ప్రతీ విద్యార్థి ఖాతాల్లో మూడు నెలల నగదు జమ చేసింది. నగదు విడుదలపై విద్యార్థినులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

15 కేజీబీవీల్లో 3,722 మంది

జిల్లాలో గిరిజన ప్రాంతాలు అధికంగా ఉండటంతో ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు ఎక్కువగా ఉన్నాయి. వీటితోపాటు మండలానికి ఒకటిచొప్పున 15 కస్తూరిబా విద్యాలయాలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 3,722 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ముఖ్యంగా నిరుపేద విద్యార్థినులకు ఈ విద్యాలయాలు వరంగా మారాయి. అయితే కొన్ని నెలల క్రితం ప్రభుత్వం ఆరోగ్య కిట్లకు బదులుగా నగదు అందిస్తామని ప్రకటించింది. ఇందుకోసం విద్యార్థులతో బ్యాంకు ఖాతాలు తీయించాలని ప్రత్యేకాధికారులను ఆదేశించింది. దీంతో కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు పోస్టాఫీస్‌లు, బ్యాంకుల్లో బాలికలతో ప్రత్యేక ఖాతాలు ఓపెన్ చేయించారు. ఇప్పటికే 90 శాతం విద్యార్థులకు ఖాతాలు ఉన్నాయి. ఈ ఆరోగ్య కిట్లకు సంబంధించిన నగదు జూన్ నుంచి పెండింగ్‌లోనే ఉంది. ప్రతినెలా రూ.వంద చొప్పున నేరుగా ఖాతాల్లో జమ కావాల్సిన నగదు అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థినుల పరిస్థితిని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం మూడు నెలల బకాయిలను విడుదల చేసింది. మిగిలిన నగదు సైతం త్వరలోనే జమవుతుందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

మండలాల వారీగా విద్యార్థులు

చింతలమానెపల్లి	285
ఆసిఫాబాద్	334
పెంచికల్‌పేట్	179
కాగజ్‌నగర్	239
రెబ్బెన	287
జైనూర్	331
సిర్పూర్(టి)	226
వాంకిడి	230
కౌటాల	173
లింగాపూర్	124
కెరమెరి	273
సిర్పూర్(యూ)	215
బెజ్జూర్	312
తిర్యాణి	204
దహెగాం	310

నగదు విడుదలైంది

కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులకు ప్రభుత్వం ఆరోగ్య కిట్లకు సంబంధించిన నగదు విడుదల చేసింది. ఇప్పటికే విద్యార్థులతో బ్యాంకు ఖాతాలు తెరిపించాం. ప్రస్తుతం మూడు నెలల బకాయిలు విడుదల కాగా, పెండింగ్ నిధులు విడుదలైన వెంటనే తెలియజేస్తాం.
– జి.స్వర్ణ, కేజీబీవీల జిల్లా అధికారి

నకిలీల జోరు

కాగజ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ ఏరియాలోని కిరాణా దుకాణంలో ఓ వినియోగదారుడు సామగ్రిని కొనుగోలు చేశాడు. అతడికి గడువు ముగిసిన కారం, చిరునామా, తయారీ, గడువు లేని మసాలా ప్యాకెట్లు ఇచ్చారు. ఈ విషయాన్ని గమనించిన సదరు వినియోగదారుడు ఆహార తనిఖీ అధికారులకు ఫిర్యాదు చేశాడు.. జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు దుకాణాదారులపై నమ్మకం ఉంచి ఇచ్చింది తీసుకెళ్తున్నారు. నిరక్షరాసుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కొంతమంది వ్యాపారులు నకిలీ, కాలం చెల్లిన వస్తువులు అంటగడుతున్నారు.



కాగజ్‌నగర్‌లో తనిఖీ చేస్తున్న ఆహార తనిఖీ అధికారులు (ఫైల్)

- కాగజ్‌నగర్ కేంద్రంగా అమ్మకాలు
- నాణ్యతలేని వస్తువులతో నష్టపోతున్న వినియోగదారులు
- తనిఖీలు చేపట్టని అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: జిల్లాలో ఆహార పదార్థాల నకిలీల వ్యవహారం జోరుగా కొనసాగుతోంది. ముఖ్యంగా పిండి పదార్థాలు, రవ్వ, కారం, పసుపు పొడులు, టీపొడర్ లాంటివి నకిలీవి విక్రయిస్తున్నారు. జిల్లాలో పారిశ్రామిక ప్రాంతమైన కాగజ్‌నగర్‌లో ఈ దందా జోరుగా సాగుతోంది. ఇతర ప్రాంతాల నుంచి నకిలీ వస్తువులను దిగుమతి చేసుకుని, చుట్టపక్కల మండలాల నుంచి వచ్చే వినియోగదారులకు అంటగడుతున్నారు. నాసిరకం, నకిలీ వస్తువులు అమ్ముతూ అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అడపాదడపా అధికారులు తనిఖీ చేస్తున్నా ఈ దందాకు అడ్డుకట్ట పడటం లేదు.

కాగజ్‌నగర్‌లో ముగ్గురిపై కేసు..

కాగజ్‌నగర్‌లోని దుకాణాలు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలపై ఫిబ్రవరి 18న ఆహా ర తనిఖీ అధికారులు దాడులు చేపట్టారు. ఈ తనిఖీల్లో కాలం చెల్లిన వస్తువులు, నాసిరకం ఆహార పదార్థాలు, కల్తీ నూనెలు, పిండి వస్తువుల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. పలుచోట్ల సేకరించిన నమూనాలు ప్రయోగశాల్లో కల్తీవని నిర్ధారణ కావడంతో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. మార్చి 25న మరోసారి అధికారులు కిరాణా దుకాణాలు, హోటళ్లలో తనిఖీలు చేపట్టి న మూనాలను ప్రయోగశాలకు పంపించారు. ఫలితాలు రావాల్సి ఉందని అధికారులు వెల్లడించారు.

ప్రమాణాలు పాటించని హోటళ్లు

జిల్లాలో సుమారు 50కి పైగా హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చిరుతిండ్లు తయారు చేసే బండ్లు ఉన్నాయి. అయితే ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సిబ్బంది కొరతతో అధికారులు ఎప్పుడో ఒకసారి తనిఖీలు చేపడుతుండటంతో వ్యాపారులు నాణ్యతను గాలికొదిలేస్తున్నారు. ముఖ్యంగా నూనె నాసిరకమైంది వినియోగించడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వంట నూనెలను రెండు, మూడు సార్లు మరగబెట్టి వాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రతినెలా తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

నకిలీ వస్తువులు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. పప్పులు, శనగ, గోధుమ పిండి పదార్థాలు ఎక్కువగా నాసిరకంగా ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలి.
– ముంజం ఆనంద్‌కుమార్, కాగజ్‌నగర్

రశీదు తప్పనిసరి

కిరాణా దుకాణాల్లో వస్తువులు కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. వస్తువుల ప్యాకెజీపై తయారీ, గడువు తేదీలను చూసుకోవాలి. నాణ్యత పాటించని హోటళ్లపై చర్యలు తీసుకుంటాం. ఈ ఏడాది జిల్లాలో 13 మందిపై కేసులు నమోదు చేశాం. నకిలీ వస్తువులు అమ్మినట్లు తెలిస్తే ఫిర్యాదు చేయాలి.
– తారాసింగ్ నాయక్, జిల్లా ఇన్‌చార్జి ఆహార తనిఖీ అధికారి

ముగిసిన 'పది' పరీక్షలు



పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు



హాస్టల్ నుంచి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

- చివరి రోజు 53 మంది గైర్హాజరు
- వసతి గృహాల నుంచి ఇంటిబాట పట్టిన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షకు 6,683 మంది విద్యార్థులకు 6,630 మంది హాజరు కాగా, 53 మంది గైర్హాజరయ్యారు. విద్యాశాఖ నిబంధనల మేరకు జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించినట్లు డీఈవో అశోక్ తెలిపారు. పరీక్షలు ముగియడంతో జిల్లాలోని వసతి గృహాలు, గురుకులాల్లోని పదో తరగతి విద్యార్థులు ఇంటి బాట పట్టారు. తల్లిదండ్రులతో కలిసి సొంతూళ్లకు బయలుదేరడంతో బస్టాండ్లు రద్దీగా మారాయి.

నేటి నుంచి ఎస్‌ఏ– 2 పరీక్షలు

జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు బుధవారం నుంచి ఎస్‌ఏ– 2 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తెలిపారు. ప్రాథమిక తరగతుల విద్యార్థులకు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 6, 7 తరగతి విద్యార్థులకు ప్రథమ భాష మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3:45 గంటల వరకు, మిగిలిన పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. 8వ తరగతి విద్యార్థులకు గణితం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3:45 గంటల వరకు, బయోసైన్స్ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4:45 గంటల వరకు, మిగిలిన పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. 9వ తరగతి విద్యార్థులకు గణితం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫిజికల్ సైన్స్, ఉదయం 11:20 నుంచి 12:50 వరకు మిగిలిన పరీక్షలు ఉదయం 11:20 నుంచి 12:50 గంటల వరకు ఉంటాయని వెల్లడించారు.

'బీసీలపై బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్నచూపు'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఓబీసీ మోర్చా నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్ర జనాభాలో 54 శాతం ఉన్న బీసీలను బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చప్పిడి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పల్లెపల్లెకు ఓబీసీ– ఇంటింటికీ బీజేపీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో బీసీలను బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో అణచివేసిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటూ గద్దెనెక్కిన తర్వాత విస్మరిస్తున్నారని ఆరోపించారు. బీసీలకు గొర్రెలు, బర్రెలు కాకుండా వారి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. దళితబంధు తరహాలో బీసీ బంధును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ గ్రామంలో బీసీలు ఆర్థికాభివృద్ధి సాధించేలా బ్యాంకు రుణాలు అందించాలన్నారు. బీసీల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మల్లేశ్, నాయకులు రాంబాబు, మల్లేశ్, వేణుగోపాల్, కనకయ్య, మధుకర్ పాల్గొన్నారు.

పన్నుల వసూళ్ల లక్ష్యం సాధించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- అధికారులతో సమీక్ష

ఆసిఫాబాద్: జిల్లాలోని మున్సిపాలిటీ పరిధిలో నిర్దేశించిన పన్నుల లక్ష్యాన్ని సాధించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో కలిసి పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, అభివృద్ధి పనులపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. నర్సరీల నిర్వహణ సక్రమంగా ఉండాలని, మొక్కల పరిరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. వైకుంఠ ధామాలు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ ప్రణాళిక, పారిశుధ్యం, నర్సరీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, పక్కన అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు సత్వరం పరిష్కరించాలి

ఆసిఫాబాద్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అట్రాసిటీ కేసులపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో రాజేశ్వర్, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సజీవన్, మానిటరింగ్ కమిటీ సభ్యులు రేగుంట కేశవరావు, మహోల్కర్ అశోక్, గోపాల్ నాయక్, వెంకటేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు స్ఫూర్తి ప్రదాత పూలే

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- నివాళులర్పించిన ఎస్పీ సురేశ్‌కుమార్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్‌రూరల్: సమ సమాజ స్థాపనలో భావితరాలకు నిత్య స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిబా పూలే అని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. పూలే జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావుతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి పూలే అని కొనియాడారు. వివక్షతకు గురైన వర్గాల్లో ఆత్మస్థైర్యం నింపి, వారి హక్కుల కోసం పోరాడారని గుర్తు చేశారు. విద్యారంగంలో జిల్లాను ముందు వరుసలో ఉంచేవిధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, ఎంపీపీ మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లన్న, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు మారుతి, కేశవరావు, రజీ హైదర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, తదితరులు



నివాళులర్పిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఎస్పీ కార్యాలయంలో

జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సురేశ్‌కుమార్ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ భీంరావు, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రాణాప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్డులోని పూలే విగ్రహానికి ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు తదితరులు నివాళులర్పించారు.

పూలే కలలు సాకారం చేసేలా పాలన

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

కాగజ్‌నగర్‌రూరల్: మహాత్మా జ్యోతిబా పూలే కలలు సాకారం చేసేలా కేసీఆర్ ప్రభుత్వ పాలన సాగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని రాస్పెల్లిలో మంగళవారం జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ కుల, లింగ వివక్షతకు తావు లేకుండా అన్నివర్గాలకు విద్యనందించాలని, విద్యతోనే బడుగు, బలహీన వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు మాట్లాడుతూ పూలే ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నారని పేర్కొన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సిద్దిక్, సర్పంచ్ పద్మకిషన్, మాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



పూలే దంపతుల విగ్రహాలు ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, వైస్‌చైర్మన్ కృష్ణారావు

క్లుప్తంగా

ఉపకరణాలకోసం దరఖాస్తు చేసుకోండి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని దివ్యాంగులు 2022–23 ఆర్థికసంవత్సరానికి గానూ ఉపకరణాలకోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగుల కోసం రిట్రోఫీటెడ్ మోటార్ వెహికిల్స్, బ్యాటరీ వీల్‌చైర్స్, ల్యాప్‌టాప్‌లు, 4జి స్మార్ట్‌ఫోన్లు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, చంక కర్రలు, వినికిడి యంత్రాలు, అంధుల చేతికర్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఈ నెల 25 లోగా ఆన్‌లైన్‌లో https:// tsobmms .cgg. gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల్లోపు ఉన్నవారు అర్హులని, గతంలో దరఖాస్తు చేసుకున్న వారు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్న వారు సంబంధిత ధృవపత్రాలతో దరఖాస్తులను జిల్లా సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో అందించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తాండూర్(బెల్లంపల్లి): మతిస్థిమితంలేని మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం తాండూర్ ఐబీ ప్రాంతం నుంచి రేపల్లెవాడకు వెళ్లే రోడ్డుమార్గంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆసిఫాబాద్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన పూదరి అమృత (40) అక్కడికక్కడే మృతి చెందింది. నాలుగేళ్లుగా సదరు మహిళ మతిస్థిమితం కోల్పోయి రోడ్లవెంట తిరుగుతోంది. మృతురాలి తండ్రి పెంటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మావోయిస్టులు లొంగిపోవాలని పోస్టర్లతో ప్రచారం



పోస్టర్ అంటిస్తున్న పోలీసులు

కోటపల్లి(చెన్నూర్): మావోయిస్టులు వనాలు వీడి జనాల్లోకి రావాలని సరికొత్త కార్యక్రమాలతో కోటపల్లి పోలీసులు ప్రచారం నిర్వహిస్తున్నారు. మావోయిస్టు అగ్రనేతలు, వారిపై ఉన్న రివార్డులను ఫొటోలతో సహా ముద్రించి గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో అతికిస్తూ ఎస్సై వెంకట్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు.

'నా భూమి నాకు ఇప్పించాలి'




మాట్లాడుతున్న సూరిబాబు

బెల్లంపల్లి: పట్టణంలోని సింగరేణి ఏరియా ఆస్పత్రి ఎదుట టకారియానగర్‌లో తాను కొనుగోలు చేసిన రెండు గుంటల భూమిని కబ్జా చేసి తనకు అన్యాయం చేస్తున్నారని బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ మత్త మారి సూరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తన భూమిని సాన శ్రావణ్ అనే వ్యక్తి కబ్జా చేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నాడన్నారు. భూ ఆక్రమణపై హైకోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్, రెవెన్యూ అధికారులు స్పందించి గతంలో కట్టడాన్ని కూల్చివేసి భవిష్యత్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యే చిన్నయ్య జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

అభాగ్యులకు అభయం!

- ఆర్థిక భరోసాకు 'మిషన్ వాత్సల్య'
- కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు నెలకు రూ.4 వేలు
- ఇతర కారణాలతో అనాథలైన వారికి నెలకు రూ.2 వేల ఆర్థికసాయం అందజేత

మంచిర్యాలటౌన్: తల్లిదండ్రులను కోల్పోయి అభాగ్యులైన పిల్లలకు మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా ఆర్థికసాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలో అనాధలు, తల్లిదండ్రులకు దూరమైన వారు, పాక్షికంగా అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు), ప్రాణాంతకమైన వ్యాధి బారిన పడి, పేదరికంతో ఇంటిపెద్దను కోల్పోయిన వారు, ఇతరత్రా కారణాలతో తల్లిదండ్రులను కోల్పోయి ఇతరులపై ఆధారపడి జీవిస్తున్న 56 మందికి, హెచ్ఐవీ, తలసేమియా, అనారోగ్యంతో ఉన్న తల్లిదండ్రుల పిల్లలు ఆరుగురికి ప్రతీనెల రూ.2 వేల చొప్పున అందిస్తున్నారు. కరోనా సమయంలో తల్లి లేదా తండ్రి, ఇద్దరినీ కోల్పోయిన జిల్లాలోని ఆరుగురు చిన్నారులకు మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా నెలకు రూ.4 వేల ఆర్థికసాయం అందిస్తున్నారు. కుమురం భీం జిల్లాలో కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన ఏడుగురు చిన్నారులకు, నిర్మల్ జిల్లాలో ఇద్దరు చిన్నారులకు మిషన్ వాత్సల్య పథకం కింద రెండు సంవత్సరాలుగా రూ.4వేల ఆర్థికసాయం అందిస్తున్నారు. చిన్నారులకు 18 ఏళ్లు నిండేవరకు సాయం అందిస్తామని అధికారులు తెలిపారు. ఈ పథకం ద్వారా అందరికీ రూ.4 వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ నుంచి మాత్రం కోవిడ్ బాధిత కుటుంబాల పిల్లలకు మాత్రమే రూ.4 వేలు అందిస్తున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



ఎంపిక ఇలా..

అర్హులైన వారు స్థానికంగా ఉండే అంగన్‌వాడీ కేంద్రంలో సంప్రదించడంతో పాటు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం, బాలల సంరక్షణ విభాగంలోనూ సంప్రదించాలి. వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి, సీడబ్ల్యూసీ అధికారి, డీసీపీవో, ఎస్‌ఐసీపీవో, శిశు, గృహ సంక్షేమాధికారి, జిల్లాలోని ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన అధికారి, తదితర సభ్యులున్న కమిటీ సభ్యులు అర్హులను ఎంపిక చేస్తారు.

జత చేయాల్సిన పత్రాలు

జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, తల్లి, లేదా తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం, గార్డియన్ (సంరక్షకుడు) ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, బోనోఫైడ్ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ వివరాలు, వ్యక్తిగత అకౌంట్ లేదా తల్లి, తండ్రి లేదా సంరక్షకులతో జాయింట్ అకౌంట్.

ఆర్థికసాయం అందిస్తున్నాం



మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా జిల్లాలో కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన ఆరుగురు పిల్లలకు నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాం. తల్లిదండ్రులను కోల్పోయిన, అనాథలుగా మారిన, పేదరికంతో ఉంటూ ఇంటిపెద్దను కోల్పోయిన, విడాకులు పొందిన, ప్రాణాంతక వ్యాధి బారిన పడ్డ తల్లిదండ్రులు ఉన్న పిల్లలు 62 మందికి చదువుకోసం ప్రతీనెల రూ.2 వేల ఆర్థికసాయం అందిస్తున్నాం.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, మంచిర్యాల

అర్హులు వీరే

ఎటువంటి ఆదరణ లేక అభాగ్యులుగా మిగిలిన పిల్లలకు చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా మిషన్ వాత్సల్య పథకాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి స్పాన్సర్‌షిప్‌ను కల్పిస్తున్నాయి. నిరాదరణ, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకుడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని చేపట్టారు. జిల్లాలో ఉన్న అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులు కోల్పోయిన వారు, తల్లిదండ్రులు దూరమైన వారు పాక్షిక అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు), తల్లిదండ్రులు విడాకులు పొందిన వారి పిల్లలు, కుటుంబం వదిలేసిన, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారిన పడినవారు, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయినవారు, ఇల్లులేని పిల్లలకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలకార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, బాల యాచకులు, బాల్య వివాహం, హెచ్ఐవి బాధిత, పీడిత బాలలు, తలసేమియా వ్యాధి బారిన పడ్డ బాలలకు పథకాన్ని వర్తింపజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలకు మించరాదు. ఈ పథకానికి ఎంపికైన వారు ఇంటినుంచి పాఠశాలకు వెళ్తే ఆర్థిక సాయం ఇవ్వనున్నారు. చదువు మధ్యలో ఆపేస్తే ఆర్థికసాయం నిలిపివేస్తారు. ఈ పథకం ద్వారా కేవలం కోవిడ్ బాధిత కుటుంబాల పిల్లలకు మాత్రమే రూ.4 వేలను ఇస్తుండగా, మిగతా వారికి రూ.2 వేల చొప్పున ఆర్థిక సాయంను అందిస్తున్నారు.

ఐదుగురికి కరోనా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. రెండు రోజుల వ్యవధిలోనే పది మంది కరోనా వైరస్ బారినపడ్డారు. మంగళవారం జిల్లాలో 54 మందికి పరీక్షలు నిర్వహించగా 49 మందికి నెగిటివ్ వచ్చింది. జైనథ్ మండలం సావాపూర్ గ్రామానికి చెందిన ఏడాది బాలిక, మాండగడలో యాభైఏళ్ల వ్యక్తికి, నార్నూర్‌లో ఏడాది బాలుడు, ఉట్నూర్ మండలం సాలెవాడలో యాభైఏళ్ల మహిళ, గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన వృద్ధునికి పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం 13 యాక్టివ్ కేసులు ఉన్నాయి. రిమ్స్‌లో ముగ్గురు, హోం ఐసోలేషన్‌లో పదిమంది చికిత్స పొందుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 23 మందికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 23 మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు నిర్మల్ పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడడంతో కోర్టులో హాజరు పరిచారు. 23మందికి రూ.32,100 జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడికల్ జడ్జి తీర్పుఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్‌లో ఐదుగురు వ్యక్తులతో పాటు పలు పశువులు, పెంపుడు కుక్కలపై మంగళవారం ఓ పిచ్చికుక్క దాడికి పాలప్డింది. గ్రామానికి చెందిన కమ్మరి రాజేందర్, జంగిలి అంజలి, తుమ్మ నర్సయ్య, వేల్పుల శ్యాం, గాజుల నర్సవ్వతో పాటు గ్రామంలోని పలుదూడలు, పెంపుడు కుక్కలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ సందర్భంగా గ్రామస్తులు శునకాన్ని చంపివేశారు. గ్రామంలో కుక్కల బెడద లేకుండా పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరారు.

గనులపై పూలే జయంతి వేడుకలు



మాట్లాడుతున్న ఏజెంట్ సత్యనారాయణ

శ్రీరాంపూర్(మంచిర్యాల): మహాత్మా జ్యోతిరావు పూలే 196వ జయంతి వేడుకలను సింగరేణి గనులపై మంగళవారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్కే 7 గనిపై నిర్వహించిన వేడుకల్లో గ్రూపు ఏజెంట్ సత్యనారాయణ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే గొప్ప సామాజిక తత్వవేత్త అన్నారు. నాటి సమాజంలోని అనేక రుగ్మతులకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. మహిళలకు విద్య ప్రాముఖ్యతను వివరించి అనేక పాఠశాలలను ఏర్పాటు చేయించారనాన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ సాయిప్రసాద్, అసోసియేషన్ నాయకులు, మెండె వెంకటి, అశోక్, రౌతు సత్యనారాయణ, మోత్కూరి కొమురయ్య, గొర్ల సంతోశ్, పొగాకు రమేశ్ పాల్గొన్నారు. ఆర్కే 5 గనిపై నిర్వహించిన కార్యక్రమంలో గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్, ఎస్సార్పీ 1 గనిపై మేనేజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఎస్సార్పీ 3 గనిపై కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో పూలేకు నివాళులర్పించారు. ఆర్కే 6 గనిపై పెట్టం లక్ష్మణ్, ముస్కె సమ్మయ్యల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆయా గనులపై జరిగిన కార్యక్రమాల్లో అసోసియేషన్ నాయకులు పెట్టం శ్రీనివాస్, వెంగళ కుమారస్వామి, అద్దు శ్రీనివాస్, ఎంబడి తిరుపతి, బూస రమేశ్, నీలం సదయ్య, సత్యనారాయణ, నాగేశ్వర్‌రావు, సదానందం, గడ్డం మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను కాటేసిన విద్యుత్

- ఫీజు సరిచేస్తుండగా షాక్ తగిలి రైతు మృతి
- పెగడపల్లిలో విషాదం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై



రాంరెడ్డి(ఫైల్)

జైపూర్(చెన్నూర్): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను చివరిదశలో కాపాడుకునేందుకు పంటపొలానికి వెళ్లిన రైతును విద్యుత్ రూపంలో మృత్యువు కాటేసింది. జైపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన రిక్కుల రాంరెడ్డి(45), జయ దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం గడుపుతున్నారు. ఈ ఏడాది యాసంగిలో తమకున్న ఐదెకరాలతో పాటు మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకుని వరిపంట సాగు చేశాడు. ప్రస్తుతం పంట గింజదశకు చేరుకుంది. పంటకు నీరు పెట్టేందుకు సోమవారం రాత్రి పొలం వద్దకు వెళ్లాడు. 12 గంటలకు త్రీఫేజ్ కరెంట్ వచ్చింది. బోరునుంచి నీళ్లు రాకపోవడంతో స్టార్టర్ డబ్బా తీసి ఫీజులు సరిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం ఉదయం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లిచూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎస్సై రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహానికి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి కుమారుడు జితేందర్‌రెడ్డి, కుమార్తె ప్రత్యూష ఉన్నారు.

నకిలీ వైద్యుల చెలగాటం..!

- పేరొకరిది.. వైద్యం మరొకరిది..!
- భైంసాలోని ఓ ఆస్పత్రిలో వెలుగుచూసిన ఘటన



మాట్లాడుతున్న బాధితుడు కోర్వ సచిన్

భైంసాటౌన్(ముధోల్): భైంసాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నకిలీ వైద్యులు రోగులతో చెలగాటమాడుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని గోకుల్‌నగర్‌లో ఈఎన్‌టీ(చెవి, ముక్కు, గొంతు), చర్మసంబంధ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. పట్టణానికి చెందిన కోర్వ సచిన్ సోమవారం చర్మసంబంధ చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లి సంబంధిత వైద్య నిపుణులు రాజేశ్ కోసం అడిగారు. ఓపీ చీటితో వైద్యం కోసం లోనికి వెళ్లగా రాజేశ్‌కు బదులు మరోవ్యక్తి వైద్యం అందించడంపై అనుమానించాడు. మీరు డాక్టర్ రాజేశ్ కాదు.. మీ పేరేంటని ప్రశ్నించగా తన పేరు రాజు అని చెప్పినట్లు తెలిపాడు. అప్పటికే అక్కడ ప్రిస్క్రిప్షన్‌పై రాజేశ్ పేరు ఉందని, మీరు ఆయన పేరిట ఎలా వైద్యం చేస్తున్నారని బాధితుడు ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదన్నాడు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, నకిలీ వైద్యులను అరికట్టాలని కోరారు. నకిలీ వైద్యంపై డీఎంహెచ్‌వో ధన్‌రాజ్‌ను వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

విరిగిన స్తంభం.. తప్పిన ప్రమాదం

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ విద్యుత్ స్తంభం విరిగి పెను ప్రమాదం తప్పింది. రోడ్డుకు మధ్యలో ఉన్న స్తంభాలను సంబంధిత అధికారులు సకాలంలో తొలగించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మంగళవారం సైతం ఓ లారీ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం పాక్షికంగా దెబ్బతిని పెను ప్రమాదం తప్పింది. సంబంధిత అధికారులు స్పందించి మరో స్తంభం వేయాలని ప్రజలు కోరుతున్నారు.

సహకార 'బంక్'ల కథ కంచికేనా?

- మూతబడుతున్న వినియోగదారుల పెట్రోల్ బంకులు
- ఆర్థిక నష్టాల్లో సహకార సంఘాలు
- అగమ్య గోచరంగా బంకుల నిర్వహణ



మూతపడిన తాండూర్ పెట్రోల్ బంక్

తాండూర్(బెల్లంపల్లి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న సదుద్దేశంతో ఉమ్మడి జిల్లాలో చేపట్టిన పెట్రోల్ బంక్‌ల నిర్వహణ గాడితప్పింది. వాటి నిర్వహణపై పాలకవర్గానికి, అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో ఆదిలోనే బంకులు మూతపడే పరిస్థితులు దాపురించాయి.

ధరలో వ్యత్యాసం..నిర్వహణ భారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 67 సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 7 సహకార సంఘాల తరపున పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేయాలని 2017లో ప్రతిపాదనలు చేశారు. 2018లో కడెం, అంగిర్గా, తానూరు, కుభీర్, తాండూర్‌లలో ప్రారంభించారు. బంకుల స్థాపనకు డీసీసీబీ నుంచి రూ.40 లక్షల వరకు రుణం తీసుకున్నారు. స్థలానికి నెలకు రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు చెల్లిస్తామని లీజుకు తీసుకున్నారు. సహజంగా వినియోగదారుల పెట్రోల్ బంకుల్లో ధర కాస్తా తక్కువగా ఉంటుందని వినియోగ దారులు భావిస్తారు. కానీ ప్రైవేట్ బంకుల కంటే లీటర్ పెట్రోల్ రూ.18, డీజిల్ రూ.20 వరకు అధికంగా ఉండడంతో వినియోగదారులు అటువైపు వెళ్లడం మానేశారు. దీంతో గిరాకీ లేక, నిర్వహణ కొరవడి బంకులు మూసివేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తాండూర్‌లోని పెట్రోల్ బంక్‌ను మండల కేంద్రానికి 6 కిలో మీటర్ల దూరంలో ఏర్పాటు చేయడంతో ఏమాత్రం గిరాకీ లేక మూతపడింది. తానూర్, కుభీర్, కడెం పెట్రోల్ బంక్‌లను కమర్షియల్ బంక్‌లుగా మార్చేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో రెండు నెలల క్రితం పున:ప్రారంభించి పెట్రోల్ అమ్మకాలు మాత్రమే సాగిస్తున్నాయి. కొత్తగా జన్నారం, చింతగూడలో వినియోగదారుల బంక్‌లను కమర్షియల్ బంక్‌ల పేరుతో ఏర్పాటు చేయడంతో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పెట్రోల్‌బంక్‌ల నిర్వహణకు సంబంధించి స్థానికంగా నెలకొన్న పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తాండూర్ బంక్‌ను కమర్షియల్ చేసుకోవాలని లేదంటే మరో ప్రాంతానికి తరలించే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ రెండు పద్ధతులు కూడా ఆర్థికభారంతో కూడుకున్నవి కావడంతో అంతిమ నిర్ణయం తీసుకోలేక సతమతమవుతున్నాం.

– శ్రీనివాస్, సీఈవో, పీఏసీఎస్, తాండూర్

ప్రభావిత ప్రాంతాల్లో సదుపాయాలు కల్పించాలి

- ప్రజాభిప్రాయ సేకరణలో వక్తలు
- బొగ్గు వెలికితీతకు అభ్యంతరం లేదని వెల్లడి
- ఆర్కే 8, ఎస్సార్పీ 3, 3ఏ గనులకు ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మధుసూదన్

శ్రీరాంపూర్(మంచిర్యాల): బొగ్గు గనుల ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు వక్తలు కోరారు. భూగర్భ గనుల్లో బొగ్గు తవ్వకాలకు తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని స్పష్టం చేశారు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 8, ఎస్సార్పీ 3, 3ఏ గనులకు మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి (నిజామాబాద్) ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. స్థానిక శాంతిస్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉదయ 10 నుంచి ఒంటిగంట వరకు ఎస్సార్పీ 3, 3ఏ గనికి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్కే 8 గనికి సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఆర్కే 8గని 1993లో ప్రారంభించారు. బొగ్గు నిల్వలు పూర్తి కావడంతో అక్టోబర్, 9, 2020న మూసివేశారు. కానీ 2017లో ఎన్విరాన్‌మెంట్ యాక్ట్ అమల్లోకి వచ్చిన తరువాత నుంచి ఎన్విరాన్‌మెంట్ క్లియర్స్(ఈసీ)కోసం ఇప్పుడు ఈ ఉల్లంఘన కేటగిరీ కింద ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. దీంతోపాటు ఎస్సార్పీ 3, 3ఏ గనులకు అనుమతులు ఉన్న దానికంటే అధికంగా బొగ్గు ఉత్పత్తి చేసాయి. 2007–08లో 7వేల టన్నులు, 2008–09లో 2 వేల టన్నులను అధికంగా ఉత్పత్తి చేయడంతో దీనికి అనుమతి లేనికారణంగా ఉల్లంఘన కేటగిరీలో వీటికి కూడా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు.

సింగరేణికి సహకారం..

ఈ ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన వారంతా కంపెనీకి సహకారంగానే మాట్లాడారు. కార్మికులు, యూనియన్ నేతలు, ప్రజాప్రతినిధులు దీనికి హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించారు. స్థానికంగా రోడ్లు బాగుచేయాలని, స్మశాన వాటిక నిర్మించాలని, వీధిలైట్లు వంటి స్థానిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా కాలుష్య నియంత్రణ మండలి(నిజామాబాద్) ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ లక్ష్మీప్రసాద్ ప్రసంగించిన వారి అభిప్రాయాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం త్యాగరాజు, ఏజెంట్లు సత్యనారాయణ, గోపాల్‌సింగ్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఎన్విరాన్‌మెంట్ అధికారులు కిరణ్‌కుమార్, హనుమాన్‌గౌడ్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, నాయకులు వెంగళ కుమారస్వామి, పెట్టం లక్ష్మణ్, ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీసైదా, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, సీఐటీయూ అధ్యక్షుడు టీ రాజారెడ్డి, ఉపాధ్యక్షుడు భాగ్యరాజ్, అధ్యక్షుడు మిడివెల్లి శంకర్, హెచ్ఎమ్మెస్ ఉపాధ్యక్షుడు జీవన్‌జోయల్, కార్యదర్శి తిప్పారపు సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

గనులతో ఇబ్బందులు ఉండవు



ప్రస్తుతం గోదావరి నుంచి వస్తున్న తాగు నీరు కలుషితంగా ఉంది. కోట్ల లాభాలు సాధిస్తున్న కంపెనీ ఉద్యోగులు, ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం తాగడానికి పరిశుద్ధమైన నీటిని సరఫరా చేయాలి. భూగర్భ గనులు వల్ల ఎలాంటి కాలుష్య ఇబ్బందులు ఉండవు. సింగరేణిని రక్షించుకోవాలంటే ఇలాంటి గనులకు సహకరిస్తాం.

– బీ.వెంకట్రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు

ఎలాంటి అభ్యంతరం లేదు



భూగర్భ గనులకు సంబంధించి బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి అభ్యంతరాలు లేవు. వీటికి తామెప్పుడూ సానుకూలమే. భూగర్భ జలాల సంరక్షణకోసం మరిన్ని చర్యలు చేపట్టాలి. పక్కన గోదావరినది ఉండటం వల్ల తాగునీటికి ఇబ్బంది లేకున్నప్పటికి ఆనీరు కలుషితంగా రావడం ఇబ్బందిగా మారింది. కాలనీల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి తాగునీరందించాలి.

– సీతారామయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

సదుపాయాలు కల్పిస్తాం



రాయల్ టాకీస్ నుంచి ఎస్సార్పీ 3, 3 గని మధ్య ఉన్న రోడ్డుకు లైటింగ్ సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రోడ్డు విస్తరణ కోసం భూసేకరణ చేయాల్సి ఉంది. గోదావరిలో నీరు నిల్వ ఉండటం వల్ల రంగు మారి కలుషితంగా వస్తుంది. దీని కోసం రూ.16 కోట్లతో ఆర్‌జీఎఫ్ ఫిల్టర్ బెడ్‌లు ఏర్పాటు చేస్తున్నాం.

– బీ.సంజీవరెడ్డి, జీఎం శ్రీరాంపూర్